పెళ్ళాం - కళ్ళెం

పచ్చిపులుసు వెంకటేశ్వర్లు

"హిట్లరు, ముసోలినీలు నీపేరు వినుంటే అన్ని ఘాతుకాలు చేయకముందే చచ్చి వుండేవారే తాయారూ!" అన్నాడు వెంకటేశం.

"వాళ్ళెవరండీ ఆ బడుద్ధాయిలూ!"

"అదుగో ఆ బడుద్ధాయి సర్టిఫికేటు వింటేనే చస్తారు."

"ఇవ్వాళేం చావు పురాణం తీశారు?"

"పురాణం కాదే పురుషశ్రాద్ధం. ఇంది రమ్మను "నియంతో, నియంతో" అని ఆడి పోసుకుంటారుగాని అసలయిన నియంత నీవేనే తాయారూ!"

"నియంత అంటే ఏమిటండీ?"

"ఎంత అమాయకురాలివే! నియంత అంటే నిండుదనం. నిండుగా రెండోవాడిని నోరెత్త నీయకుండా, సర్వకార్యకలాపాలలో చోటు చేసుకుని, ఆర్థికమైన పెత్తనం చలాయించడం"

"ఏమండోయ్! నోరుమూసుకుని వున్నానని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు."

"తాయారూ! నువ్వు నోరు మూసుకున్నావా? నీనోరు చూస్తే చాలు మానోళ్ళు రక్కున మూత బడవూ! అసలు మాయలూ, మంత్రాలు లేవంటారుగాని, ప్రపంచంలో అన్నిటికంటే పెద్దమాయ ఆడదాని నోరేనే."

"ఏమిటో ఇవాళ ఇలా మాట్లాడుతున్నారు. బాధ్యతలన్నీ నానెత్తిన పడవేసి బలాదూరులా తిరుగుతున్నారు. సంసారాన్ని ఎన్ని అవస్థలు పడి లాక్కొస్తున్నానో మీకేమి తెలుసు? నేనేమైనా దుబారా చేస్తున్నానా? చీరెలు, సారెలు కొని కులుకుతున్నానా? ఇక్కడ నేనేమి బావుకుంటున్నాను? మీరిచ్చే జీతం డబ్బుల్లో ఎంత జాగ్రత్తగా కర్చు పెడితే సంసారం జపగుతుందంటారు?"

"అదిగో రికార్డు మొదలయింది. మొన్న ఏ పుస్తకంలోనో చదివాను. రెండు రకాల గ్రామఫోన్లున్నాయట. మానవుడు సృష్టించిందొకటి. దాన్ని కావాలనుకున్నప్పుడు పెట్టవచ్చు. వద్దు అనుకున్నపుడు ఆపివేయవచ్చు. ఇక రెండోది దేవుడిచ్చింది. అది నోరట. ఆడించడం మొదలుపెడితే, ఆపడం దేవుడికే శక్యం కాదట."

"అబ్బా! నన్నాడిపోసుకోవడం తప్ప మీకు ఇంకోపని లేదుకదా!"

"నీనోరు ఆడించి నేను పోసుకునేదేముందే"

"ఇంతకూ ఈ కంఠశోష దేనికోసమో!"

"నాది కంఠశోషా! తోటి ఉద్యోగస్తులందరూ నీటుగా, ట్రిమ్‌గా, బూటు, సూటుతో వస్తున్నారే అని చెప్పడం కంఠశోషా! నేను ఓల్డు చెప్పులతో, ఉతకేసిన పేంటు షర్టులతో వెళ్తున్నానే అని చెప్పడం కంఠశోషేనా! అందరూ సైకిళ్ళలో వెళ్తున్నారే, నేను నడిచి వెళ్తున్నానే అంటే అర్థంగావడం లేదా!"

"అయ్యో! పెద్ద ఆఫీసులో చిన్నగుమాస్తా గారూ! ఒక వెయ్యి రూపాయిలు మోయిన కోరికలు కోరుతున్నారు. అంటే రెండునెలలు పస్తుండాలన్నమాట మనం."

"అదేమంటే యిలా నానోరు కట్టేస్తావు. నలుగురితో సమానంగా ఉండకపోతే నా పరువు ప్రిస్టేజి పోదవిగదే!"

"మీ పరువు, ప్రిస్టేజికోసం పిల్లల్ని, సంసారాన్ని పస్తులుంచ మంటారా? ఇదిగో ఈ తిప్పలన్నీ నాకెందుకండీ? నెలజీతం నా కివ్వద్దు. మీ చేతిలోనే ఉంచుకుని ఖర్చు పెట్టండి. ఇవిగో తాళం చెవులు. సామాన్లుతెస్తేఉడకేస్తాను. లేకుంటే ఊరుకుంటా! బాధ్యత అందరం తెలుసుకుంటే సరేగాని, చిన్నపిల్లల్లా మీరూ మారాం చేస్తే, ఇక పిల్లలు ఊరుకుంటారా? వాళ్ళకు లేవూ కోరికలు? నాకు లేవూ కోరికలు? అందరం ఇష్టమొచ్చినట్టు ఖర్చు చేస్తే బొచ్చెత్తుకు పోవాల్సిందే. ఇదివరకు చేసిన నిర్వాకం చాలదూ!"



వెంకటేశం నోట్లో పచ్చి వెలక్కాయ పడింది, ఈ శత్రువును జయించ డానికిది బ్రహ్మాస్త్రం.

మెల్లగా నోరెత్తకుండా జారుకున్నాడు వెంకటేశం.

* * *

ఇదివరకు చేసిన నిర్వాకం! అంటే యేమిటది!

ఇక యిది వెంకటేశం ఫ్లాష్‌బాక్ పరిస్థితి.

బీరువా తాళాలు తనచేతిలో, నెలజీతం జేబీలో ఉన్నపుడు వెంకటేశాన్ని పట్టడానికి పగ్గాలుండవు.

ఒళ్ళు తెలియదు, ఇల్లు తెలియదు.

పర్సు ఖాళీ అయేంతవరకు నిద్రపట్టదు.

పర్సులో పైసావుంటే అతనికంటె దానకర్ణుడు మరొకడు లేడు. అతనిని మించిన జల్సా పురుషుడూ వేరొకడు లేడు. ఫ్రెండ్సు - హోటల్సు - సినిమాలు - సరదాలు.

పాపం, ఏ దుర్వ్యసనాలు లేవు. కాని పనికి మాలిన వస్తువునల్లా, కంటికింపుగా కనుపించినవల్లా కొనేసేవాడు.

జేబీ ఖాళీ అయితే మిత్రుల దగ్గర అప్పు తీసుకునేవాడు. స్నేహితులందరి వద్ద అప్పు తీసుకోవడం అయింది. తండాలిచ్చే వాడి చేతిలో చిక్కుకున్నాడు.

వాడిబాకీ తీర్చలేక నానా అవస్థలూ పడుతున్నాడు. అసలుకు వడ్డీ, వడ్డీకి వడ్డీ. వాడు వచ్చి ఆఫీసులో పరువు తీశాడు. ఇంటికొచ్చి కేకలు వేయడం మొదలుపెట్టాడు. అప్పటికప్పుడు తీరిస్తే తప్పితే కదలనని మొరాయించాడు.

ఏమి చేయాలి? ఎలా తీర్చాలి? వెంకటేశం ఏసుక్కు చచ్చాడు. భార్యకు తెలిస్తే అలుసైపోతామే అని యేడ్చాడు.

భార్యకు తెలియకా తప్పలేదు. అలుసుకాకా తప్పలేదు.

వెంకటేశం ఖర్చు మనిషైతే, తాయారు నోటి మనిషి.

ఇంకేమి చేస్తాడు? చేసుకున్నవారికి చేసుకున్నంత మహాదేవ!

అన్ని ప్రశ్నలకూ, శాపనార్థాలకూ ఒకటే జవాబు షోడాబుడ్డి మొఖమేయడం.

భార్య తనమెడలోని గొలుసు తీసిచ్చి, ఎక్కడయినా కుదువబెట్టి, బాకీ తీర్చమన్నది.

గ–చెప్పినట్లు చేశాడు హార్ మోస్టు ఒబీడి యంట్ హస్బెండ్‌లా.

వెంకటేశం కుక్కిన పేనయాడు, నక్కిన పామయాడు.

ఆ రోజు రాత్రి అస్త్రసన్యాసయోగం——

"తాయారూ! ఇంకిలాగయితే లాభంలేదు. చాలా అవస్థలు పడతాం" అన్నాడు వైరాగ్య ధోరణిలో.

"మనల్ని మనం అదుపులో పెట్టుకుంటే అవస్థలెందుకు వస్తాయండీ? మీరు సంపాదించే జీతంలో నలుగురు పిల్లలూ, మనం జీవించాల్నా! ఎంతో పొదుపుగా వాడితేగాని సంసారం గడవదే! ఇలా విచ్చలవిడిగా ఖర్చు చేస్తే ఎలాగండీ? ఈ సోఫాసెట్లు, ఈ గుడ్డలు మన ఆకలి తీరుస్తాయా? ముందు మింగడానికి మెతుకులు, తర్వాతే మీసాలకు సంపెంగ నూనె."

"తాయారూ! వచ్చిన పామును యెందుకే ఇంకా చంపుతావు? నిజమేనే, నేను చాలా తప్పుచేశాను. వీటిని సరిదిద్దుకునే మార్గం నాకు ఒకటే తోస్తూంది——"

"ఏమిటండీ అది?"

"తాళాలు నీచేతికిస్తాను. నెల జీతం రావడంతోటే నీ దోసిట్లో పోస్తుంటాను. ఇక నాకు రోజు ఖర్చుకు ఇంతని జేబీలో వేస్తూండు. నేను ఆ డబ్బుతోనే గడుపుతాను. ఇక ఇంటిని నువ్వు నిర్వహించు."

"ఈ బాధ్యతలన్నీ నాకెందుకండీ! ఏదో ఉడకేసి వడవేసి, పిల్లల్ని చూచుకునేదాన్ని!"

"తాయారూ! నువ్వు చూచుకోక తప్పదు. నా చేతిలో డబ్బు నిలవదు."

"అయితే నేను చెప్పినమాట వినాలండీ! మనకుండే బట్టలు మూడు, నాలుగు సంవత్సరాలకు సరిపోతాయి. ఇంక బట్టలు కొనకూడదు. దానధర్మాలు, హోటళ్ళు మానేయాలి. చెడీబడీ కొనటం విరమించుకోవాలి. అప్పు చేయనేకూడదు. ఆఫీసు దూరమైనా నడిచే వెళ్ళాలి. మధ్యలో అవి కావాలి, యివి కావాలని అడగకూడదు."

"తాయారూ! నా సంగతి తెలుసుగదా! మరల మరల యెందుకు అన్ని కండిషన్లు చెబుతావు."

"మీ సంగతి తెలుసు కాబట్టే చెబుతున్నాను. మధ్యలో నన్నుతిట్టి లాభంలేదు."

"అలాగే . అలాగే"

అలా ఒప్పందం జరిగింది.

దువారాచేతిని అదుపులో పెట్టుకునేందుకు చాలా అవస్థపడ్డాడు. కోరికల గుర్రాలకు కళ్లాలు వేసాడు. ఆ కళ్ళాలను పెళ్ళాంచేతిలో పెట్టాడు.

తనతోటి పనిచేసే వాళ్ళంతా కుర్రవాళ్ళు. చాలామంది కొత్తగా పెళ్ళయినవాళ్ళు. నూతన పెళ్ళికుమారుళ్ళు కావడంవల్లా, మామగార్ల చలవవల్లా, పైలాపచ్చీసుగా అతి ఆడంబరంగా డ్రస్సులు చేసుకుని స్కూటర్లపై వస్తూపోతూ వుంటారు.

విలువయిన సిగరెట్లతో విలువగా వస్తూ పోతున్నారు.

తానందరిముందూ కీరాగా కనుపిస్తున్నానేమో ననే ఇన్ఫిరియారిటీకాంప్లెక్స్ పట్టుకుంది వెంకటేశాన్ని.

అప్పటికీ తాయారు రోజూ గుడ్డలు ఉతకేసి శుభ్రంచేసి, చెంవిస్త్రీ చేసియిస్తూంది.

పాపమాయిల్లాలు యెన్నో ఇంటాలుపడి, సంసారాన్ని ఒక ఒడ్డునవేసింది.

అప్పులబాధ తీరిపోయింది.

కాని వెంకటేశం ఉగ్గపట్టలేక పోతున్నాడు.

ఏమీ అనలేక పోతున్నాడు.

ఇక ఊరుకుండలేక పెళ్ళగక్కాడు.

బయటపడితే యిదీ వరస.

*　　　*　　　*

వెంకటేశానికి ఆఫీసు పనిమీద హైదరాబాద్ పోవలసిన పనిబడింది.

మహా ఉల్లాసంగా వున్నాడు. జైలునుండి విడుదల కాబోయే ఖైదీలా వున్నాడు.

ఉత్సాహంగా భార్యవద్దకువచ్చి "తాయారూ! హైదరాబాద్ వెళ్ళవలసిన పనిబడ్డది. గుడ్డలవీ సర్దు" అన్నాడు.

"ఏమిటో విశేషం?"

"ఆఫీసు పనిమీద పోతున్నాను."

"ప్రయాణపు ఖర్చులు ఆఫీసువాళ్ళే యిస్తారు కాబోలు."

"ఆఫీసు యివ్వకపోతే మన చేతిది పెట్టు కుంటామా? అయితే పోయి వచ్చిన తరవాత బిల్లు చేసుకోవాలి."

"ప్రస్తుతం మనదగ్గర ఉండద్దూ. ఉన్నప్పుడు పోదురుగాని లేండి."

"అబ్బా ఎలాగే నీతో ఏడ్చేది. నీకు T.A. రూల్సు తెలియవు. తర్వాత పోదాం అని గవర్నమెంటుకు చెప్పుకోవచ్చునా? వాళ్ళు పొమ్మన్నప్పుడు పోవాల్సిందే."

"అయితే ప్రభుత్వంవారి దృష్టిలో మనం ఎప్పుడు పడితే అప్పుడు హైదరాబాద్ వెళ్ళి రాగల స్థితిలో వున్నామనా?"

"కాదు తాయారూ! అప్పుచేసుకుని వెళ్ళి రమ్మని."

"మీలాంటి గుమాస్తాలకు అప్పుమాత్రం దొరుకుతుందా?"

"తాయారూ! కాలికేస్తే మెడకు, మెడకేస్తే కాలికి తగిలిస్తావు. నీతో మాట్లాడటం మహా కష్టమే. ఆ రూల్సు పెట్టేప్పుడు ముందు నీతో మాట్లాడాల్సిందే. పొరపాటు చేశారు."

"ఆ రూల్స్‌పెట్టిన ఆఫీసర్లూ, మీరూ జుట్టు జుట్టు పట్టుకోండి. ఆ అప్పు ఏ వెధవిస్తాడో వాడి దగ్గరికెళ్ళండి."

"ఒసేవ్. అప్పిచ్చువాడు వైద్యుడన్నారు గాని, వెధవన్లేదే! తాయారూ! నా తాళాలూ, నా జీతం, నాజుట్టు, నా కళ్ళాలు నీ చేతికి ఏనాడో యిచ్చాను. మరి సర్వబాధ్యతలూ సమర్పించాను. అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ. ఈ కర్చు కెలాగో సద్దు."

"సద్దు సద్దు అంటారు. ఎక్కణ్ణించి తెచ్చేది? సరే ఏదోక తంటాలు పడతాను. కానివ్వండి. ఋఋపు బాధ్యతలు నా నెత్తినవేసి మీరు యిష్టం వచ్చినట్లు తిరిగిరండి."

"అదుగో తాయారూ! నేను మాత్రము చేయటం లేదటే గొడ్డుచాకిరి?"

"సరే మీకిదేచెప్పడం. అక్కడ పనికి మాలినవన్నీ కొనకండి. ఇష్టమొచ్చినట్లు కర్చుచేయకండి."

"కృష్ణుడు అర్జునుడికి బోధించినట్లు బోధిస్తున్నావుగదే! నేనేం చిన్నపిల్లాణ్ణా?"

"అంతకంటే హీనం!"

"చూడు, చూడు, రౌతు మెత్తనయితే గుర్రం మూడుకాళ్ళమీద నడుస్తుంది."

"సరేలేండి మీ మాటలకేమి" అంటూ వెళ్ళింది తాయారు.

ఉన్నవాటిలో మంచిగుడ్డలు ఎరుకున్నాడు. షోకిల్లాగా తయారయాడు.

"దీవించి అంపవేదేవీమాంచాలా" అన్నాడు.

"రతిరాజ సుందరా, రణరంగధీరా!" అని అనలేదుగానీ తాయారు "క్షేమంగావెళ్ళి లాభం లేకుంటే మానెగాని, నష్టంలేకుండా రాండి."

పిల్లలుచూడకుండా తాయారును ముద్దుపెట్టు కున్నాడు.

రాహుఘడియలులేకుండాచూచి రైలెక్కాడు.

ఇప్పుడతను స్వేచ్ఛా విహంగం.

పురివిప్పిన నెమలిలా మనసు ఆడుతోంది.

కోరికలు గుర్రాలై సందడి పెట్టాయి.

విసిరేసిన గాలిపటంలా విహరిస్తున్నాడు.

కళ్ళెమిప్పుడు భార్యచేతిలోలేదు.

జేబీలోనూటయాభై రూపాయలు.మనసులో రెండువందల కోరికలు.

జాలీగా రైలుదిగి లాడ్జికి వెళ్లాడు.

ఆఫీసుపని చూసుకుని సాయంత్రం బజారుకు వచ్చాడు.

ఏమి కనులపండువుగావుంది మహానగరం.

రకరకాల ఆభరణాలు ధరించి, రంగురంగుల చీరెధరించి, ప్రియునికోసం యెదురుచూచే అభిసారికలా వయ్యారంగావేచియుంది అందాల భాగ్యనగరం.

మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలతో మిల మిల మెరిసిపోతూంది.

మనసు "బూటో, బూటో" అంటోంది. వయసు 'సూటో, సూటో' అంటోంది. ఎంత అణగద్రొక్కుకుందామన్నా కోరికలు అణగడం లేదు.

ఒక్క పర్యాయం ఆఫీసు స్టాఫంతా కళ్ళ ముందు కదిలింది. తానెందుకు వారికంటే కీతా గుండాలి? కొనెయ్యాలి ఎలాగయినా బూటు.

అబ్బ బూట్లు ఎన్నిరకాలున్నాయి! కళ్ళు మెరుస్తున్నాయి, పళ్ళు ఊరుస్తున్నాయి (తినేందుకు కాదు, తొడుక్కునేందుకు).

ముందు వెనుక ఆలోచించలేదు. పదిషాపులు తిరిగి నచ్చిన బూటు అమాంతం కొనేసేడు. ఏభై రూపాయలు బూటు జత (ఒకటి కాదు). చాలా చీపే! బూటు మీదకు సాక్సు, తోటి బాక్సు. పిల్లలు గుర్తొచ్చారు. రిబ్బన్లు, తిను బండారాలు కొన్నాడు.

అమాంతం భార్యమీద ప్రేమపుట్టుకొచ్చింది. తన చేతిగుండా భార్యకు ఒక్క చీరెన్నా కొని యివ్వలేదు. ఇంతవరకు తనకోర్కెలు తీర్చు కోవడంతోనే సరిపోతుంది గానీ, భార్య ఒకటి వున్నదని, దానికీ కోర్కెలుంటాయని, భరించే భర్తగదా మరి! కోర్కెలు తీర్చే బాధ్యత స్వీకరించాలి గదా!

నచ్చిన చీరెనల్లా క్రింద వేయించాడు. ఆఖరుకు కొట్టువాడి దృష్టిలో అతి తక్కువరేటు, తన దృష్టిలో ఎక్కువ రేటులో ఒకచీరె తీసాడు.

బయటకొచ్చి లెక్కచూసుకుంటే ముప్ఫై రూపాయలు మిగిలాయి.

గుండె గుభిల్లుమంది.

లాడ్జి బాడుగివ్వాలి, మరుసటి రోజంతా పనివుంది. ఆరోజు కర్చు. తిరుగు ప్రయాణానికి రైలుచార్జీ! ముప్ఫై సరిపోవే. ఎలా! ఎలా?

చెమటలు పోస్తూంది శరీరం. ఈ మహానగరంలో తనకెవరూ తెలియదు. తీసు'కొన్న'వి వాపసుచేస్తే తీసుకోరు.

కొనేప్పుడు మురిపించిన వస్తువులు ఇప్పుడు భయపెడుతున్నాయి. వాటిని సరిగా చూడలేక పోతున్నాడు. కొనాల, కొనాలని వేధించిన మనసుఎందుకుకొన్నానా అని వేధించసాగింది.

దివ్యకాంతులతో వెలిగిపోయే నగరం వెలిసిపోయి కనుపిస్తూంది. అందరాని ప్రమానిపంకుగా, తనవంటి మధ్యతరగతి వాని కడుపు మంటగా అగుపడుతూంది.

తొలివలపు ఊలుపు తీరిన ప్రియుడిలా చూస్తున్నాడు నగరప్రేయసిని.

రూముచేరి మంచంపై వాలాడు.

ఆకలి కావడంలేదు. లేవడానికి బుద్ధి పుట్టడంలేదు. తిరిగి ఊరికి ఎలా వెళ్ళాలా అని ఆలోచిస్తున్నాడు.

అర్ధరాత్రికి కన్నుకురికాడు.

* * *

సూర్యోదయమైంది.

ఎన్నిరకాలుగా మాట్లాడుకున్నా, కాట్లాడు కున్నా, నిద్ర లేవడంతోటే తన భార్యా, తానూ ఒకరి ముఖాలొకరు చూచుకోవాలి.

అది వారి అనురాగ నియమం, అనుబంధ చిహ్నం.

తాను పరాయిచోటికి వచ్చాడు కదా! ఎలా ముఖాలు చూసుకుంటారు?

తాయారు ఒక చిన్న కవరులో తన ఫోటో పెట్టి పంపింది.

వెంకటేశం నిద్రలేచి, తన భార్య ఫోటో బయటకు తీశాడు. ఫోటోలో భార్య ముఖం చూడ బుద్ధి కాలేదు. సిగ్గేసింది. అలా చూసి యిలా పెట్టేశాడు.

భార్యను తలచుకొని చాలా బాధపడుతున్నాడు. భార్య తెలివిముందు తన తెలివి ఎందుకూ పనికి రాదనుకుంటున్నాడు.

కవరులోపెట్టేందుకుకవరు మరలతెరిచాడు.

ఆశ్చర్యం. అందులో ముప్ఫై రూపాయలున్నాయి.

వాటితోటి ఒకచిన్న కాగితం ముక్కవుంది. దానిపై ఒకే ఒక వాక్యం వుంది.

"మీ సంగతి నాకు తెలుసు."

పైకం చూచి ఎక్కడలేని ఆనందం. ఆ వాక్యం చదివి ఎక్కడలేని సిగ్గు, పరిస్థితులు ఎంచుకొని దుఃఖం.

ఆ ఫోటోను చూడలేకచూడలేక చూచాడు.

ఫోటోలో తాయారు నవ్వుతూంది.

తాయార్ని వెక్కిరించి, ఫోటోను ముద్దులతో నింపాడు.

మళ్ళీ జాగ్రత్తగా కళ్ళాన్ని తీసుకెళ్ళి, పెళ్ళాం చేతిలో ఉంచాలని నిర్ణయించుకున్నాడు. □

Edited&Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony Kodambakkam,Madras-600024,& Printed by D. Hanumantha Rao,at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600001.